క్లుప్తంగా

లచ్చన్న విగ్రహావిష్కరణ

కవిటి: రాజపురంలో శ్రీశయన సామాజిక ఆధ్వర్యంలో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఏవీ రామకృష్ణ, డాక్టర్ తుంగాన వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవుని దర్శించుకున్న జిల్లా జడ్జి



ధరిణికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

మందస: మందసలోని వాసుదేవస్వామిని స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జిల్లా న్యాయమూర్తి ధరణి బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు మందస తహసీల్దార్ బడే పాపారావు, అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో సన్మానించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

సేవల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

టెక్కలి: సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ హెచ్చరించారు. బుధవారం టెక్కలిలో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నీ సకాలంలో తెరవాలని, క్రమం తప్పకుండా టీహెచ్ఆర్ అందజేయాలన్నారు. కార్యకర్తలు, సహాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని నేరుగా వారికే అందజేయాలన్నారు. నోడల్ అధికారి మణి, సీడీపీఓ శోభారాణి, ఐసీటీఎస్ కోఆర్డినేటర్ సీతారాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



నారాయణరావు (ఫైల్)

కవిటి: చిన్నకర్రివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న అల్లుమల్ల నారాయణరావు మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన మెరుగైన వైద్య చికిత్సల కోసం సెలవులో ఉన్నారు. వైద్యం చేసినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మృతి చెందినట్టు మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తెలిపారు. నారాయణరావు మృతికి ఎంఈవో ధనంజయమజ్జి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సంతాపాన్ని తెలియజేశారు.

ఆర్థిక సాయం చేసి.. ఆదర్శంగా నిలిచి..



కృష్ణారావుకు సాయాన్ని అందజేస్తున్న ఉద్దానం వలస కూలీలు

ఇచ్ఛాపురం రూరల్: ముంబాయిలోని బోయిసర్ ప్రాంతంలో కృష్ణారావు అనే తెలుగోడు నివసిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అక్కడ ఉంటున్న ఉద్దానం వలస కూలీలు పులకల ప్రకాశ్ ఆధ్వర్యంలో రూ.12,370 సేకరించారు. ఈ మొత్తాన్ని కృష్ణారావుకు బుధవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



కొత్తపేటలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం చేస్తున్న గృహసారథులు

కోటబొమ్మాళి: చిన్నసాన, కొత్తపేట సచివాలయాల పరిధిలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నూక సత్యరాజ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు బుధవారం ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ రాంపాత్రుని సావిత్రి, బోనే ఎల్లయ్య, ఎంఎల్‌వో తారకేశ్వరరావు, కన్వీనర్లు మేడిబోయిన నారాయణరావు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

ఇచ్ఛాపురం: విద్యార్థులు మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఎస్సై కె.గోవిందరావు అన్నారు. పట్టణంలోని స్వర్ణభారతి విద్యాసంస్థల్లో మానవ హక్కులు– సోషల్ మీడియా, పోలీస్, న్యాయశాఖ అనే అంశంపై ఉపన్యాస పోటీలను బుధవారం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్, ప్రిన్సిపాల్ జయప్రకాష్, హెచ్ఎం గౌరీశంకర్ ఉన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు అన్నారు. వలంటీర్లు, సచివాలయాల ఇన్‌చార్జిలు, గృహసారథులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని 14, 15వ వార్డు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య



సోంపేట: పలాసపురంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద



వజ్రపుకొత్తూరు రూరల్: దోకులపాడులో సంక్షేమ పథకాల జాబితాను ఆవిష్కరిస్తున్న నాయకులు



సంతబొమ్మాళి: చిన్న తుంగాంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పార్టీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి



పలాస: లొద్దబద్రలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు తదితరులు



మందస: బాలిగాంలో లబ్ధిదారుల వివరాలను ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కంచిలి: మఠం సరియాపల్లి సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, జడ్పీటిసి సభ్యురాలు ఇప్పిలి లోలాక్షిలు



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో పార్టీను జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ



కోటబొమ్మాళి: గంగరాంలో అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు



కవిటి: బిగొనపపుట్టుగలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ యుగంధర్



కాశీబుగ్గ: మున్సిపాలిటీ 19వ వార్డు రెల్లివీధిలో పార్టీ జెండాను ఎగురువేస్తున్న నాయకులు



నందిగాం: దేవళభద్రలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, మండల కన్వీనర్ ఫల్గుణరావు

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం

- మండల సమావేశంలో గృహ నిర్మాణ శాఖపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం సదుద్దేశంతో పేదలందరికీ ఇళ్లు ఇచ్చి సకాలంలో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ బిల్లుల చెల్లింపు, జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు విఫలమవుతున్నారని సభ్యులు మండి పడ్డారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణ, విద్య, అటవీ, నీటిపారుదలశాఖల అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో నిర్మాణం పూర్తి చేస్తుకున్న ఇళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో గృహనిర్మాణ శాఖ ఏఈఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వహించడం వల్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లు చెల్లించడం లేదని, కాలనీలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంలో తాత్సారం చేస్తున్నారని అక్కుపల్లి, కొత్తపేట సర్పంచ్‌లు లండ లోలాక్షి, అంబటి శ్రీను సభ దృష్టికి తెచ్చారు. 2190 ఇళ్లకు ఇప్పటి వరకు 965 మాత్రమే నిర్మించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఈఈ శ్రీకాంత్, సిబ్బంది వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని గృహనిర్మాణ శాఖ నిర్లక్ష్యంపై ఎంపీపీ నీలవేణి దృష్టికి తీసుకెళ్లారు. వజ్రపుకొత్తూరును కరువు మండలంగా ప్రకటించి రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా అందిచాలని పెద్దబొడ్డపాడు, సైనూరు సర్పంచ్‌లు టి.ఢిల్లీరావు, ఎ.గోవిందరావు కోరారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.కిరణ్‌వాణి కోరారు. ఇప్పటికే గ్రామాల వారీగా పంట నష్టాలను అంచనా వేస్తున్నామన్నారు. మండలంలో 2043 ఎకరాల్లో వరి పైరు ఎండిపోయిందన్నారు. కరువు మండలంగా ప్రకటించాలని ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో జగనన్న గోరు ముద్ద పథకానికి సంబంధించి వంట పాత్రలు, ఇతర సామగ్రి పంపిణీలో సర్పంచ్‌లకు భాగస్వామ్యం చేయడం లేదని, సమాచారం కూడా ఇవ్వడం లేదని, నాడు– నేడు పనుల పూర్తయిన పాఠశాలల్లో శిలాఫలకాలు ఏర్పాటు చేయడంలేదని సర్పంచ్‌లు లండ లోలాక్షి, చింత రాజు, ఎ.గోవిందరావు అన్నారు. పెదబొడ్డపాడు పంచాయతీ నారాయణపురం సామాజిక అటవీ శాఖ భూములు దాదాపు 200 ఎకరాలు కబ్జాకు గురైయ్యాయని, మాజీ ఆర్మీ సైనికులమంటూ ఆక్రమించుకున్నారని వాటిని తొలగించి ఆ పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ, భూమి లేని నిరుపేదలకు చెట్టు– పట్టా ఇవ్వాలని పెద్ద బొడ్డపాడు సర్పంచ్ తమ్మినేని ఢిల్లీ రావు, ఎంపీటీసీ సభ్యుడు ఉరిటి కామేశ్వరరావు తహసీల్దార్ బి.అప్పలస్వామికి వినతి పత్రం అందించారు. వంశధార నీరు నేటి వరకు పొలాలకు అందడం లేదని, సంతబొమ్మాళి, టెక్కలి మండలాల్లో సాగునీరు వృథాగా సముద్రానికి పోతున్నా ఎవరూ స్పందించడం లేదని సభ్యులు సంబంధిత అధికారులను నిలదీశారు.

నగరంపల్లి పంచాయతీలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఏడుగురికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని ఫిర్యాదు అందడంతో వాటిని తొలగిచాలని కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపామని తహసీల్దార్ అప్పలస్వామి తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో డిక్కల తిరుమలరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపీపీ వంక రాజు, మండల విప్ తిర్రి గుణ పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం



మందిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: మందస మండల పరిషత్ సమావేశ మందిరాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం ప్రారంభించారు. సుమారు రూ.10 లక్షలతో భవనాన్ని నిర్మించారు. అంతేకాకుండా పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలను కూడా ప్రత్యేకంగా నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిషోర్‌కుమార్, సిందిరి జగన్, జి.జయచంద్రుడు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఏఈలు కణితి కృష్ణారావు, గార రామ్మోహనరావు, ఎల్.యోగి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సొంతగూటికి కేశుపురం ఎంపీటీసీ సభ్యుడు



చక్రవర్తిరెడ్డికి పార్టీ కండువ వేస్తున్న సాయిరాజ్

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం ఎంపీటీసీ సభ్యుడు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఈయన ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అందిస్తున్న సేవలు దృష్ట్యా తిరిగి సొంతగూటికి చేరడం ఆనందంగా ఉందని చక్రవర్తిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త సాయిరాజ్ చక్రవర్తి నివాస గృహం సన్యాసిపుట్టుగలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ నీలాపు చంద్రయ్య, మాజీ జెట్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి, పిలక భాస్కరరావు, కీలు ఉమాశంకర్ ఉన్నారు.

ఒక్కటిగా ఉందాం.. జెండాను ఎగురవేద్దాం

మనమంతా ఒక్కటిగా ఉండి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన సన్యాసిపుట్టుగలో జరిగిన కార్యక్రమంలో స్థానిక పెద్దలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర యాదవ్, వైస్ ఎంపీపీలు దున్న గురుమూర్తి, మండల సమన్వయకర్త పాతిర్ల రాజశేఖరరెడ్డి, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, నీలాపు చంద్రయ్య, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి జనం నీరాజనాలు

- టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి



లబ్ధిని వివరిస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. గోవిందపురం సచివాలయ పరిధిలోని కాకరాపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ రథసారథి అయిన జగనన్నను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపతిరావు రాఘవరావు, దువ్వాడ హైందవి, ఎం.అప్పారావు, ఎన్.భీమారావు, పి.రామకృష్ణ, పి.పాపారావు, పల్లి శివ, ఆర్.రామిరెడ్డి, చింతాడ చిన్నారావు ఉన్నారు.

పశువుల రవాణా వాహనం సీజ్



పశువులతో పట్టుబడిన వాహనం

కవిటి: మండల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద కొజ్జీరియా సమీపంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని కవిటి పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఎస్సై కె.రాము తెలిపిన వివరాల ప్రకారం.. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా టోల్‌ప్లాజా సమీపంలో కొజ్జీరియా–కరాపాడు గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేశారు. అనుమానం వచ్చి ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వెళుతున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో తొమ్మిది ఆవులు, ఎద్దులు తరలిస్తూ పట్టుబడ్డారు. వాహనాన్ని సీజ్ చేసి పశువుల్ని సమీపంలోని బారువ గోశాలకు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కళ్లద్దాలు పంపిణీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా బుధవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. పలాస ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శిష్టు గోపి, సచివాలయాల కన్వీనర్ బడగల బల్లయ్యానాయుడు పాల్గొన్నారు.

మందసను కరువు ప్రాంతంగా ప్రకటించాలి



మంత్రి అప్పలరాజుకు సమస్యను వివరిస్తున్న రైతు సంఘ నాయకులు

మందస: మందస మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. మందస పట్టణంలో రైతుల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ.. శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో పంటలు పండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నక్కసాయి, బంతిబంద, సంకుజోడు, గోపాలసాగరాలను రిజర్వాయర్లుగా నిర్మించి, వంశధార ఛానల్స్‌తో అనుసంధానం చేయాలన్నారు. ఈ సందర్భంగా అదే దారిలో వెళ్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు రైతు సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేసి పరిస్థితులను వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. తహసీల్దార్ బడే పాపారావుకు కూడా వినతిపత్రాన్ని అందజేశారు. మహేంద్ర, చైతన్య రైతు సంఘాల అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు, కొర్ల హేమారావు చౌదరి పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

- రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ప్రాథమిక స్థాయి నుంచి ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అభ్యసన అభివృద్ధి కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. వాటికి అనుగుణంగా ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి నుంచి చదవడం, రాయడం అనర్గళంగా రావాలన్నారు. టెక్కలి బాలికోన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అభ్యసన అభివృద్ధి శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. రాష్ట్ర పరిశీలకుడు ఉపేందర్ రెడ్డి, పర్యవేక్షణ అధికారి కల్పన సేల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థికి సరైన శిక్షణ అందజేస్తే, మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కల్పన సేల్ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాల ప్రణాళిక కచ్చితంగా పాటించాలన్నారు. డీఈవో వెంకటేశ్వరరావు, లిప్ రిసోర్స్ పర్సన్ ప్రవీణ్‌కుమార్, నళినీకాంత్, టెక్కలి ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, 16 మండలాలకు చెందిన మండల విద్యా శాఖాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ: ఆల్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం పలాస సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆవరణలో బుధవారం ఘనంగా జరిగింది. అధ్యక్షత వహించిన స్థానిక సబ్ ట్రెజరీ అధికారి ఎల్.రామారావు మాట్లాడుతూ.. తమ పరిధిలో 943 మంది పెన్షనర్లు ఉన్నారని.. వారికి ఎదురైన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పారావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు నర్సింగరావు, కార్యదర్శులు సత్యనారాయణ, మోహనరావు, సలహాదారులు దుర్యోధన, సుందరరావు, సబ్ ట్రెజరర్ త్రివేణి, భాగ్యలక్ష్మి, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

వజ్రపుకొత్తూరు రూరల్: వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో నష్టపోయిన వరి పంటను అంచన వేయడానికి జిల్లా వ్యవసాయ అధికార యంత్రాంగం, రాగోలు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ మేరకు గరుడబద్ర, వజ్రపుకొత్తూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికార బృందం స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి నివేదించి ప్రతి రైతులకు మేలు కలిగే విధంగా కృషి చేస్తామన్నారు. పర్యటనలో వ్యవసాయ సంచాలకులు కె.శ్రీధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, అమరజ్యోతి, పలాస వ్యవసాయ సంచాలకులు ఎల్.వి.మధు, వ్యవసాయాధికారి కిరణ్‌వాణి, సర్పంచ్ గూడ గిరిజ ఉన్నారు.

మొదుగులపుట్టిలో..

పలాస: మోదుగులపుట్టిలో ఎండిపోయిన వరి పొలాలను అధికారులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థి చదువుకు సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: కేసరపడ గ్రామానికి చెందిన మాలి కిశోర్ మహాపాత్రో ఎస్.ఎం.పురం ఏపీఆర్ఎస్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థికి పదో తరగతి వరకు చదువుకోడానికి ఏడాదికి రూ. ఐదు వేలు చొప్పున మొత్తంగా రు. 25 వేలు సాయం అందిస్తామని మండలంలోని మఠంసరియాపల్లి గ్రామానికి చెందిన టాలెంటరీ సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ఈ మేరకు తొలి ఏడాదికి సంబంధించిన ఐదు వేల రూపాయలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ పాడి చేతులమీదుగా విద్యార్థి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. కిశోర్ టాలెంటరీ సంస్థలోనే ఉచిత శిక్షణ పొంది, సీటు పొందినట్లు నిర్వాహకులు కె.మురళి తెలిపారు.

సంక్షిప్తంగా...

స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందనలు

ఇచ్ఛాపురం: ఈనెల 11, 12 తేదీల్లో తిరుపతిలో జరిగిన అంతర్ పాఠశాలల స్విమ్మింగ్ క్రీడా పోటీలో అండర్–19 విభాగంలో సత్తాచాటి మూడో స్థానంలో నిలిచిన క్రీడాకారులను స్థానిక వ్యాయామ అభినందించారు. శ్రీసురంగి రాజా క్రీడా మైదానంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభంరెడ్డి, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాకన్నపురంలో పంటల సర్వే

సోంపేట: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమూనా గుర్తింపులో భాగంగా మాకన్నపురం గ్రామంలో జాతీయ నమూనా సర్వే సంస్థ ఎన్ఎస్ఎస్‌వో విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ బుధవారం సర్వే చేపట్టారు. ఎంపిక చేసిన నమూనా పొలాలను సర్వేనంబర్ల వారీగా పరిశీలించారు.

బారువ డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ టీం

సోంపేట: బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సభ్యుడు సభ్యులు డాక్టర్ కె.ఎస్.ఠాకుర్ తదితరులు బుధవారం సందర్శించారు. రికార్డులు, ప్రయోగశాలలు, భవనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, గ్రామస్తులు, పూర్వవిద్యార్థులతో మాట్లాడి కళాశాల పూర్తి వివరాలు సేకరించారు. న్యాక్ టీం సభ్యులు ఓ.పి.సింగ్, అశోక్ గాబర్డ్, కళాశాల ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ ఉన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

పలాస: శ్రీకాకుళం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు.

కబడ్డీ పోటీల విజేత బహడపల్లి

మందస: దీపావళి సందర్భంగా లొహరిబందకొత్తూరులో మూడు రోజులుగా జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో 63 జట్లు పాల్గొన్నాయి. బహడపల్లి జట్టు ప్రథమ బహుమతి గెలుచుకోగా, ద్వితీయ స్థానంలో కొండవూరు, తృతీయ బహుమతిని కంబైన్డ్‌గా పాందూరు, లింబుగాం జట్లు గెలుపొందాయి.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ: ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పలాస ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. పలాస మండలానికి చెందిన బూత్‌లెవిల్ ఆఫీసర్లతో బుధవారం సమీక్షించారు. ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలన్నారు. పలువురు డీటీలు పాల్గొన్నారు.